andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.6 ; కనిష్ఠం 26.8

నిర్మల్ జిల్లా వార్తలు

8

ఆదివారం 30 జూన్ 2024



దివ్యనగర్ అయ్యప్ప ఆలయ సమీపంలో కబ్జాకు గురవుతున్న కుంట

అటకెక్కిన గొలుసుకట్టు చెరువుల డీజీపీఎస్ సర్వే

- మూడు చెరువులకే పరిమితం
- రికార్డుల ఆధారంగా విస్తీర్ణత నిర్ధారణ
- సర్వే, హద్దులు లేక ఆగని ఆక్రమణలు

జిల్లా కేంద్రంలోని చారిత్రక గొలుసుకట్టు చెరువుల రక్షణ కోసం సంబంధిత అధికారులు కొద్దిరోజుల క్రితం డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజీషనింగ్ సిస్టం) సర్వేను తెరపైకి తెచ్చారు. ఈ డీజీపీఎస్ పరికరం శాటిలైట్‌తో అనుసంధానమై భూముల హద్దులను పక్కాగా నిర్వహిస్తోంది. ముఖ్యంగా చెరువుల భూముల విస్తీర్ణాన్ని పక్కాగా కొలిచేందుకు ఈ పరికరం ఎంతో తోడ్పడుతుందని అధికారులు అప్పట్లో వెల్లడించారు. దీని సర్వే ఆధారంగా చెరువులకు సంబంధించిన శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ భూములకు రక్షణ ఏర్పడుతుందని అధికారులు ప్రకటించారు. కాగా డీజీపీఎస్ పరికరాన్ని శాటిలైట్‌తో అనుసంధానం చేసి ఇక్కడ మూడు చెరువులకు సంబంధించి సర్వే చేశారు. ప్రస్తుతం ఉన్న రికార్డులు, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా డీజీపీఎస్ పరికరం ఈ చెరువు భూముల హద్దులను శాటిలైట్ సహకారంతో నిర్ధారించింది. డీజీపీఎస్ పరికరంతో చేపట్టిన సర్వే నివేదికలు ఇక అధికారికం కానున్నాయని ఈ నివేదికల ఆధారంగా ఇప్పటి వరకు భూమి హద్దులపై నెలకొన్న సందేహాలు తొలగిపోతాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అలాగే వివాదాలకు సైతం పరిష్కారం లభించబోనుందని తెలిపారు. మొదట జిల్లా కేంద్రంలోని కంచరోణి చెరువు, కురాన్నపేట్ చెరువు విస్తీర్ణాన్ని డీజీపీఎస్ సర్వే చేసి హద్దులను నిర్ధారించారు. ఆక్రమణకు గురైన భూములను సైతం గుర్తించి ఈ హద్దుల ఆధారంగా ట్రెంచ్‌లను సైతం ఏర్పాటు చేశారు. రాబోయే రోజుల్లో మిగతా గొలుసుకట్టు చెరువుల విస్తీర్ణాలకు కూడా డీజీపీఎస్‌తో సర్వే చేసి హద్దులను నిర్ధారించడమే కాకుండా కబ్జాలకు గురైన భూములను సైతం స్వాధీనం చేసుకుంటామని అప్పట్లో ప్రకటించారు. ఈ డీజీపీఎస్ సర్వేను రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో పాటు అప్పటి జిల్లా కలెక్టర్ సంయుక్తంగా చేపట్టారు. అయితే ఈ డీజీపీఎస్ సర్వేను కేవలం రెండు చెరువులకు మాత్రమే పరిమితం చేసి మిగతా పది చెరువులకు సర్వే చేపట్టకపోవడం కబ్జాదారులకు ఇప్పటి వరకు వరంగా మారుతుంది. సాంకేతిక పరంగా చెరువు భూముల హద్దులను గుర్తించకపోవడంతో ఇష్టారాజ్యంగా శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ భూముల ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ కబ్జాల ఆధారంగా జిల్లా కేంద్రంలోని గొలుసుకట్టు చెరువుల రూపురేఖలే అదృశ్యం అవుతున్నాయన్న విమర్శలున్నాయి.

మిగతా గొలుసు కట్టు చెరువుల డీజీపీఎస్ సర్వే ఎప్పుడు

జిల్లాకేంద్రంలోని అన్ని గొలుసుకట్టు చెరువు భూముల రక్షణకు డీజీపీఎస్ సర్వేను అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో నిమ్మనాయుడు కాలంలో ఈ చారిత్రక గొలుసు కట్టు చెరువులను బహుళ ప్రయోజనాల కోసం నిర్మించిన సంగతి తెలిసిందే. నిర్మల్ పట్టణం చుట్టూ ఉన్న ఈ చెరువులు క్రమక్రమంగా కబ్జాలకు గురవుతున్నాయి. ఇటీవల ఈ కబ్జాలపర్వం తారాస్థాయికి చేరుకుంది. పలుకుబడి పరపతి గల వ్యక్తులు ఈ చెరువు భూములను ఆక్రమించి భారీ నిర్మాణాలు చేపట్టారు. మరికొంతమంది రియల్ ఎస్టేట్ వెంచర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై నిర్మల్‌కు చెందిన సీనియర్ న్యాయవాది అంజుకుమార్ రెడ్డి కొద్దిరోజుల క్రితం రాష్ట్ర హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై హైకోర్టు స్పందించి చెరువు భూములను సర్వే చేసి ఆ భూములను రక్షించాలని రాష్ట్ర హైకోర్టు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన అప్పటి కలెక్టర్ గొలుసు కట్టు చెరువు భూముల సర్వేకు డీజీపీఎస్ పరికరాన్ని తెరపైకి తెచ్చారు. ఇప్పటికే కంచరోణి చెరువు, కురాన్నపేట్ చెరువు భూముల సర్వే డీజీపీఎస్‌తో పూర్తయ్యింది. అయితే ఖజానా చెరువు, బంగల్‌పేట్ చెరువు, పల్లె చెరువు, ధర్మాసాగర్ చెరువు, మంజులాపూర్ చెరువు, రాంసాగర్ చెరువు, సీతాసాగర్ చెరువు, మంజులాపూర్ చెరువు, పల్లె చెరువు భూములను మాత్రం డీజీపీఎస్ పరికరంతో సర్వే చేయకపోవడంతో కబ్జాదారులకు వరంగా మారింది. మళ్లీ డీజీపీఎస్ సర్వే జరిపి చెరువు భూముల వాస్తవ విస్తీర్ణం నిర్ధారించి ఆ భూములను కబ్జాల నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

రెవెన్యూ రికార్డుల ప్రకారం లెక్కలు ఇలా..

కాగా ప్రస్తుతం అధికారుల వద్ద ఉన్న చెరువు భూముల రికార్డులకు వాస్తవ పరిస్థితులకు భారీ తేడా ఉందంటున్నారు. అడ్డగోలు ఆక్రమణలు, కబ్జాలతో ఈ చెరువు భూముల విస్తీర్ణం 70 శాతానికి పైగా కనుమరుగైందని అంటున్నారు. అధికారుల వద్ద ఉన్న రికార్డుల ప్రకారం బంగల్‌పేట్ చెరువు 210.32 ఎకరాలు, ఖజానా చెరువు 98.02 ఎకరాలు, కొత్త చెరువు 33.11 ఎకరాలు, రామ్‌సాగర్ చెరువు 37.23 ఎకరాలు, జాఫూర్ కురాన్నపేట్ చెరువు 76.18 ఎకరాలు, సీతాసాగర్ గొల్ల చెరువు 48.11 ఎకరాలుల, ఇబ్రహీం చెరువు 76.18 ఎకరాలు, కంచరోణి చెరువు 74.19 ఎకరాలు, మోతి తలాబ్ చెరువు 132.06 ఎకరాలు, చిన్న చెరువు మంజులాపూర్ 81.34 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు అధికారుల వద్ద ఉన్న రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ విస్తీర్ణం నుంచి గణనీయంగా ఆక్రమణలు జరిగాయని డీజీపీఎస్ సర్వే జరిపినట్లయితే మొత్తం భూముల విస్తీర్ణానికి సబందించిన వివరాలు అలాగే ఆ భూముల్లో జరిగిన ఆక్రమణల లెక్కలు కూడా వెల్లడవుతాయంటున్నారు.

(ఆంధ్రజ్యోతి, నిర్మల్)



సీతాసాగర్ గొలుసు కట్టు చెరువు ఇదే

ఖానాపూర్‌లో మొసలి కలకలం



బొడ్డోనికుంటలో బండపై తిరుగుతున్న మొసలి

ఖానాపూర్, జూన్ 29 : ఖానాపూర్‌లో మొసలి కలకలం రేపుతోంది. శనివారం మండల కేంద్రంలోని శాంతినగర్ శివారులో గల బొడ్డోనికుంటలో సంచరిస్తూ అటుగా వెళ్లే ప్రజలకు దర్శనమిచ్చింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. బొడ్డోనికుంట ఇళ్ల మధ్యలో ఉన్నందున మొసలి ఇళ్లలోకి వచ్చి ఏ ఆపద కలిగిస్తుందోనని శాంతినగర్ కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మొసలిని పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాటర్ ఫౌంటైన్ పనులు పరిశీలించిన ఎస్పీ



పనులు పరిశీలిస్తున్న ఎస్పీ, చైర్మన్

నిర్మల్ కల్చరల్, జూన్ 29 : నిర్మల్ పట్టణం రూరల్ పోలీస్ స్టేషన్ జయశంకర్ చౌరస్తా వద్ద గల వాటర్‌ఫౌంటైన్ పనులను ఆదివారం ఎస్పీ జానకీషర్మిల, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌తో కలిసి పరిశీలించారు. అక్కడి ఫౌంటెన్ ఎత్తు ఎక్కువగా ఉండడంతో తరుచు వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఎత్తు తగ్గించేందుకు పనులు కొనసాగుతున్నాయి. కౌన్సిలర్లు నరహరి, గంధ్రత్ రమణ, అపర్ణ, ప్రదీప్, తాహీదుద్దీన్, నరేందర్, ముజాహిద్ చావుస్, అబ్రార్ పాల్గొన్నారు.

అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచండి

- జిల్లా వైద్యాధికారి ధనరాజ్

నిర్మల్ కల్చరల్, జూన్ 29 : వర్షాకాలంలో ప్రజలకు వ్యాధులు ప్రబలనున్న నేపథ్యంలో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఫార్మాసిస్టులు, సీనియర్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పాము కాటు, కుక్కకాటుకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వ్యాధినిరోధక టీకాలను శుభ్రపరిచే కోల్డ్ సైన్ వ్యవస్థ సరైన పద్ధతిలో నిర్వహించాలని సూచించారు. ఎమర్జెన్సీ మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీపీవో

సారంగాపూర్, జూన్ 29 : ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వీధులలో గ్రామస్థాయి అధికారులతో మురికి కాలువలతో పాటు పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించి, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విభాగం అధికారి రమేష్, మండల పంచాయతీ అధికారి తిరుపతిరెడ్డిలు ఉన్నారు.

భైంసా యువతికి గౌరవ డాక్టరేట్ ప్రదానం

భైంసా, జూన్ 29 : భైంసా పట్టణానికి చెందిన శ్రీ నయనం నృత్య కళానిలయం నిర్వాహకురాలు రంగు సౌమ్యకు గౌరవ డాక్టరేట్ పురస్కారం లభించింది. కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగుళూర్ కేంద్రంగా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ నృత్య కళలకు సేవలందించే ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ ఆకాడమీ రంగు సౌమ్య సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందించింది. భారత ప్రభుత్వ నీతి అయోగ్ ద్వారా గుర్తింపు పొందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ ఆకాడమీ శనివారం బెంగుళూర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

శస్త్రచికిత్స వికటించి బాలిక మృతి

- వైద్యుని నిర్లక్ష్యమే కారణమని మృతురాలి కుటుంబీకుల ఆరోపణ
- చర్యలు తీసుకోవాలంటూ ఆందోళనలు



రాస్తారోకో చేస్తున్న బాధితులు



పల్లవి (ఫైల్)



పల్లవి మృతదేహం

భైంసా, జూన్ 29 : పట్టణంలోని నర్సింహనగర్ రోడ్డు మార్గంలో గల సాయి సుప్రియ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగిన బాలిక ఒకరు మృతి చెందారు. ఆసుపత్రి వైద్యుని నిర్లక్ష్యం కారణంగానే శస్త్ర చికిత్స వికటించి సదరు బాలిక మృతి చెందిందని కుటుంబీకులు ఆరోపించారు. బాలిక మృతికి కారకుడైన వైద్యునిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టారు. మృతురాలి కుటుంబీకులు, బంధువులు తెలిపిన కథనం ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కుభీర్ మండల కేంద్రంలోని పల్లవి (14) గత ఐదు రోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుండటంతో వైద్య సేవల నిమిత్తం భైంసాలోని సాయి సుప్రియ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి శుక్రవారం రాత్రి తీసుకవచ్చారు. ఆసుపత్రి వైద్యుడు డా. రజనీకాంత్ సూచనల మేరక సదరు బాలికకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. స్కానింగ్ రిపోర్టు వివరాల ప్రకారం బాలికకు శస్త్రచికిత్స నిర్వహించాలని వైద్యుడు సూచించగా అందుకు కుటుంబీకులు అంగీకరించారు. దీంతో శుక్రవారం రాత్రి బాలికకు శస్త్రచికిత్స నిర్వహించగా శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో మృతి చెందింది. వైద్యుని నిర్లక్ష్యం మూలంగానే శస్త్ర చికిత్స వికటించి బాలిక మృతి చెందిందని, సదరు వైద్యునిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మృతురాలి కుటుంబీకులు, బంధుమిత్రులు ఆందోళనలకు దిగారు. నర్సింహనగర్ రోడ్డు మార్గంలోని ఆసుపత్రి ముందరి భాగంలో భైఠాయించి రాస్తారోకో చేపట్టారు. సంబంధిత సమాచారం అందుకున్న టౌన్ సీఐ రాజారెడ్డి ఘటన స్థలికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. సముదాయించి శాంతిపరిచి ఆందోళనలను విరమింపచేశారు. ఘటనపై ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని వివరించారు. దీంతో ఆందోళనకారులు సంబంధిత విషయమై పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. సంబంధిత మృతి ఘటనపై సాయి సుప్రియ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు డా.రజనీకాంత్‌ను వివరణ కొరగా బాలికను తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రి తీసుకవచ్చారని వెల్లడించారు. స్కానింగ్ రిపోర్ట్ ప్రకారం బాలికకు శస్త్ర చికిత్స అవసరముందని వివరించినట్లుగా తెలిపారు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించి వారి సమ్మతితో శస్త్ర చికిత్స చేపట్టామని వివరించారు. అయితే ఆదివారం ఉదయం బాలిక సెప్టిక్ షాక్ బారిన పడి బీపీలో మార్పులు చోటుచేసుకొని మృతి చెందిందని వివరించారు. .శస్త్రచికిత్స వికటించలేదని డాక్టర్ స్పష్టం చేశారు.

భారీగా గుట్కా నిల్వల పట్టివేత



భైంసా, జూన్ 29 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో శనివారం భారీగా నిషేదిత గుట్కా నిల్వలు పట్టుబడ్డాయి. జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆద్వర్యంలో టౌన్ సీఐ రాజారెడ్డి నేతృత్వంలోని పోలీసు అధికారులు, సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఇందులో సుమారు రూ.6 లక్షలకు పైగా విలువ చేసే గుట్కా నిల్వలను పోలీసులు పట్టుకొని స్వాధీనపరుచుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, టౌన్ సీఐ రాజారెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గుట్కా పైన నిషేదం విధించిందన్నారు. ఇలాంటి క్రమంలో నిషేదిత గుట్కా,తంబాకు సంబంధిత ఉత్పత్తులు ఎవరైనా విక్రయించిన, అక్రమంగా రవాణ చేసిన, నిల్వగా ఉంచిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తనిఖీల్లో ఎస్ఐలు ఎండీ షరీఫ్, నారాయణ సింగ్, ఏఎస్ఐ తారాచంద్ తోపాటు పలువురు పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మాజీ పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ మృతికి పలువురి సంతాపం

నిర్మల్ కల్చరల్, జూన్ 29 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాజీ మంత్రి డి. శ్రీనివాస్ పార్థివ దేహానికి శనివారం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీనివాస్ నివాసంలో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.

బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి డి. శ్రీనివాస్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన నివాసంలో పార్థివ దేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు.

ధరణి దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జూన్ 29 : ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలను తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధరణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, జిల్లాల వారీగా ధరణి దరఖాస్తులు, ఇప్పటి వరకు పూర్తి అయినవి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్లతో ప్రత్యేక కార్యదర్శి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మండలాల వారీగా వచ్చిన ధరణి దరఖాస్తులు, వివిధ మాడ్యూల్స్, సెషన్స్, కోర్టు కేసులు, తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలలో పరిష్కరించినవి, తదితర అంశాలను కలెక్టర్ ప్రధాన కార్యదర్శికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మండలాల వారీగా దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో సూర్యారావు, తహసీల్దార్లు, ఈడీఎం నదీమ్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు : అడిషనల్ కలెక్టర్



ఆయిల్‌ఫామ్ మొక్కలసాగును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

దస్తురాబాద్, జూన్ 29 : ఆయిల్ ఫామ్ పంట సాగుతో రైతులు అధిక లాభాలను పొందవచ్చునని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మండలంలోని రాంపూర్, గొడిసిర్యాల్ గ్రామాల్లో ఆయిల్ ఫామ్ మొక్కలు సాగు చేస్తున్న రైతుల తోటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులకు అంతర పంటలసాగు కింద ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలన్నారు. నీటి వసతి కలిగి ఉన్న రైతులు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం ఉద్యాన శాఖ నుండి డ్రిప్, మొక్కలకు రాయితీ కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి అలియా ఫాతిమా, మండల హార్టికల్చర్ అధికారి మౌనిక, ఎంపీడీవో కే. రమేష్, ఎంపీవో అనిల్ కుమార్, ఏపీవో రవి ప్రసాద్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రసాయన శాస్త్ర జాతీయ సదస్సు.. పాల్గొన్న శాస్త్రవేత్తలు



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ పావని.. వేదికపై శాస్త్రవేత్తలు

నిర్మల్ కల్చరల్, జూన్ 29 : జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సు శనివారం ముగిసింది. రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో శాస్త్రవేత్తలు తమ ప్రసంగ పాఠాలు వినిపించారు. తెలంగాణ యూనివర్సిటీకి చెందిన వక్త డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ... పారిశ్రామిక విప్లవం ద్వారా ప్రకృతి ఎలా పచ్చగా మార్చవచ్చో వివరించారు. ఆర్‌జేయూకేటీ ప్రొఫెసర్ డాక్టర్ పావని మాట్లాడుతూ... భవిష్యత్ తరాలకు సుస్థిరాభివృద్ధి ఎలా అందించాలన్న అంశాన్ని విశదీకరించారు. మానవాళి కోసం కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించడానికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు వివరించారు. ప్రిన్సిపాల్ భీంరావు, కే. విజయలక్ష్మి, సామాజిక వేత్త రవీందర్, సమన్వయకర్త సరితారాణి, డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ అజయ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లను పట్టుకున్న పోలీసులు

సారంగాపూర్, జూన్ 29 : మండలంలో గల మలక్ చించోలి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న పేకాట రాయుళ్లను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మలక్ చించోలిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకొని రూ. 8 వేల 660లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూనియర్ కళాశాలను పరిశీలించిన జిల్లా మాధ్యమిక అధికారి

సారంగాపూర్, జూన్ 29 : మండల కేంద్రంలో గల జూనియర్ కళాశాలను శనివారం జిల్లా మాధ్యమిక అధికారి పరుశురాం పరిశీలించారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేసి విద్యార్థులందరూ ప్రతి రోజు కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధ్యాపకులతో పేర్కొన్నారు. దీంతో పాటు పోటీ పరీక్షలకు హాజరయ్యే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రత్యేక విద్యాబోధనను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మారుతితో పాటు సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

నిర్మల్ కల్చరల్, జూన్ 29 : నిర్మల్ మున్సిపల్ పరిధిలో వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, వార్డుల్లో శానిటేషన్ పనులు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. చైర్మన్ ఈశ్వర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ప్రజలపై ఇటీవల వీధి కుక్కల దాడిపై చర్చ జరిగింది. పట్టణ అభివృద్ధి తదితర అంశాలపై జరిగిన చర్చలో అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కలిసికట్టుగా అభివృద్ధి పనులు కొనసాగించాలని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. డీఈ సంతోష్ జాదవ్, ఏఈ హరి భువన్, కౌన్సిలర్లు సమావేశంలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

లోకేశ్వరం, జూన్ 29 : మండలంలోని పిప్రి, బాగాపూర్, మొహల, నగర్, సేవా లాల్ తండా, గడ్‌చందా, రాయపూర్ కాండ్లీ, గొడిసెరా, సాద్గాం, బామ్ని, హవర్గా, హద్గాం, కిష్టాపూర్, బిలోలి పలు గ్రామాల్లో జిల్లా పరిషత్ నిధుల నుంచి వీధి దీపాలను శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, జూన్ 29 : నిర్మల్‌లోని 220 / 132 / 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల దృష్ట్యా ఆదివారం ఉదయం 9 నుండి 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఈ కారణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు 132 కేవీ ఖానాపూర్, బూరుగుపల్లి, పోచంపాడ్, సారంగాపూర్ స్టేషన్ల నుండి కల్పించినట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

11 కేవీ ఫీడర్‌కు నేడు మరమ్మతులు

నిర్మల్ కల్చరల్, జూన్ 29 : 11 కేవీ నిర్మల్ పట్టణ 2 ఫీడర్ మరమ్మతు పనులు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఈ కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. కోయాక్సల్, కళానగర్, మోతి నగర్, శిశుమందిర్, ద్యాగవాడ, చిక్కడపల్లి, చింతకుంట వాడ తదితర ప్రాంతాల వారికి సరఫరా ఉండదని తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శించిన డీసీసీ చీఫ్

నిర్మల్ కల్చరల్, జూన్ 29 : జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మణచాందకు చెందిన కాంగ్రెస్ నాయకుడు రవి తండ్రిని శనివారం డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. మండల పార్టీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

ఖానాపూర్, జూన్ 29 : మండలంలోని సత్తెనపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదంలో ఇళ్లు దగ్ధమైన బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. శనివారం ఘటన స్థలాన్ని పరిశీలించిన నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన గుగ్లావత్ రవీందర్ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, జిల్లా నాయకులు లక్ష్మీపతి గౌడ్, తదితరులున్నారు.

ప్రధాని మన్ కీ బాత్ వీక్షించండి : బీజేపీ

నిర్మల్ కల్చరల్, జూన్ 29 : మూడోసారి నరేంద్ర మోదీ ప్రధానిగా అయిన తరువాత మొదటిసారిగా ఆదివారం నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించాలని జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అన్ని బూత్‌లలో ఎల్ఈడీలను ఏర్పాటు చేసుకోవాలని ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుందని తెలిపారు. అనంతరం డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దినోత్సవాల నిర్వహణకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు. నాయకులు పాల్గొన్నారు.

నేడు రైతులతో సమీక్ష సమావేశం

తానూర్, జూన్ 29 : మండల కేంద్రం తానూర్‌లో ఆదివారం రైతులతో సమీక్ష సమావేశం ఉంటుందని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో భూమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, పీఏసీఎస్ సభ్యులు హాజరు కావాలన్నారు.

మాదకద్రవ్యాల కేసుల్లో పరిశోధన కీలకం

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ● ప్రత్యేక పీపీ ద్వారా పోలీసు సిబ్బందికి శిక్షణ ● పాల్గొన్న పోలీసు ఉన్నతాధికారులు


మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం


పాల్గొన్న పోలీసు ఉన్నతాధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 29: మాదకద్రవ్యాలపై పూర్తి కట్టుదిట్టమైన చర్యలతో పోలీసు యంత్రాంగం విధులను నిర్వహిస్తుందని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కేసులలో నేరస్థులకు శిక్షలు పడేలా కఠినమైన చర్యలు తీసుకుంటూ, సంపూర్ణంగా దర్యాప్తును నిర్వహిస్తు చార్జీషీట్లు దాఖలు చేయాలని సూచించారు. మాద కద్రవ్యాల కేసులలో మరింత పరిజ్ఞానాన్ని, పరిశోధనలు పెంపొందించేందుకు జిల్లా ప్రత్యేక పీపీ ముస్కు రమణారెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సిబ్బందికి దర్యాప్తు పరిశోధనపై అవగాహన నిర్వహించారు. ముఖ్యంగా మాదకద్రవ్యాలపై కేసులు చేసేటువంటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, స్టేషన్‌హౌజ్ ఆఫీసర్లు చార్జీషీట్లు దాఖలు చేసే అధికారులకు, స్టేషన్ రైటర్లకు పూర్తి అవగాహనను కల్పించేందుకు ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మాధక ద్రవ్యాల కేసులలో పరిశోధన ఎలా చేయడం, కేసు నమోదు ఏఏ పరిస్థితులను, దర్యాప్తు నిర్వహించి చార్జీషీటు దాఖలు చేసే సమయంలో తీసుకోవాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. దర్యాప్తు పక్కగా నిర్వహించి పూర్తి నివేదికను చార్జీషీటు దాఖలు చేసినప్పుడే నేరస్థులపై కఠినమైన చర్యలు తీసుకుని సరైన శిక్షలు పడుతాయన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేక పీపీని శాలువా, బహుమతితో సన్మానించారు. ఈ సందర్భంగా పీపీ ముస్కు రమణారెడ్డి మాట్లాడుతూ ఎలాంటి సందేహాలు, సమస్యలకైనా తనను సంప్రదించాలని తెలిపారు. ఇందులో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు, స్టేషన్‌రైటర్స్, ఐటీ కోర్, డీసీఆర్‌బీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలి

ఆదిలాబాద్ అర్బన్: ఉద్యోగ విరమణ అనంతరం శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం సూచించారు. ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్సై సుంకరి సాయన్న, హెడ్ కానిస్టేబుల్ కె.గణపతిలను స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు ఇందులో ఉద్యోగ విరమణ పొందే అధికారుల కుటుంబ సభ్యులు, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సీసీ దుర్గం శ్రీనివాస్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మతల్లికి పోటెత్తిన భక్తులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 29: ఆదిలాబాద్ పట్టణంలోని మారెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించుకున్నారు. ప్రతియేడు లాగే ఈ యేడు అమ్మవారికి శివసతుల నృత్యాలు చేస్తూ మహిళలు హారతులు, ప్రత్యేక బోనం కుండలతో పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లోని మారెమ్మ తల్లి ఆలయం వరకు పెద్దఎత్తున మహిళలు బోనాలతో బారులు తీరారు. ఇందులో పలువురు ఆలయ కమిటీ సభ్యులు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బాదన్ గంగన్న, రఘు, అశోక్‌లు బోనం కుండలతో మహిళలతో కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

కవ్వాల్‌ను సందర్శించిన ఐటీడీఏ పీవో

జన్నారం, జూన్ 29: జన్నారంలోని కవ్వాల టైగర్ రిజర్వును శనివారం ఉట్నూరు ఐటీడీఏ పీవో కుశ్బూగుప్తా సందర్శించారు. గోండుగూడ మల్యాల నుంచి బైసన్‌కుంట వరకు జంగల్ అటవీ శాఖ సఫారీలో పర్యటించారు. స్లోత్ బేర్లు, చింకారాలు, స్పాటెడ్ డీర్, బైసన్ వంటి వన్యప్రాణులతో పాటు సర్పెంట్ ఈగల్, హాక్ ఈగల్, వైట్ త్రోటెడ్ కింగ్‌ఫిషర్, పేరాకిట్‌లు, బ్లాక్ డ్రాంగో, కాలర్డ్ డవ్, స్పాటెడ్ డవ్ వంటి పక్షులను చూసి ఆనందం వ్యక్తం వ్యక్తంచేశారు. జంగల్ సఫరా అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. ఆయన వెంట అటవీ శాఖ అధికారులు ఉన్నారు.

పాడిపరిశ్రమతో ఆర్థికాభివృద్ధి : జేడీఏ

నేరడిగొండ, జూన్ 29: పాడి పరిశ్రమతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని జిల్లా వ్యవసాయాధికారి(జేడీఏ) పుల్లయ్య అన్నారు. శనివారం రైతు భరోసా కార్యక్రమంలో మండలంలోని కుమారి గ్రామంలో చంద్రశేఖర్‌రెడ్డి నిర్మించిన డైరీ ఫామ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత స్వచ్ఛమైన పాలకు మంచి డిమాండ్ ఉందని అన్నారు. రైతులు వ్యవసాయం చేస్తున్న పాడి పశువుల ద్వారా అధిక లాభాలు పొందవచ్చన్నారు. పాడి పరిశ్రమ ఏర్పాటు చేసుకుని రైతులకు 35 శాతం రాయితీ అందిస్తామన్నారు. ఇందులో పీఏసీఎస్ ఛైర్మన్ మందుల రమేష్, రాజుయాదవ్, చిన్నగంగన్న, తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌లో తైబజార్ వేలం

బోథ్, జూన్ 29: మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతకు శనివారం వేలం పాట నిర్వహించారు. ఎంపీడీవో రమేష్, ఈవో అంజయ్య ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించగా వేలంపాటలో వడ్లకొండ సురేందర్, అనిల్ కుమార్, రఫీ మహమ్మద్ సోలంకి, ఘనశ్యామ్ పాన్ పట్టి రాజు, ఈరన్నల రమేష్, పవర్ గోవింద్, రాములు 9 మంది వేలం పాటలో పాల్గొన్నారు. వేలంపాటలో తైబజార్‌ను బోథ్‌కు చెందిన సోలంకి రాముడు రూ.4,11500లకు దక్కించుకున్నారు. అయితే ఈనెల 9న తైబజార్ కాలపరిమితి ముగిసిపోనుంది. కాగా సంతలో సరైన వసతులు లేవని ముఖ్యంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలని వ్యాపార వర్గాల వారు కోరుతున్నారు. ప్రతీనెల డబ్బులు చెల్లిస్తున్నా వసతులు మాత్రం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శలున్నాయి.

పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య

బోథ్, జూన్ 29: మండలంలోని మరల పెళ్లి గ్రామానికి చెందిన గడ్డల రవి(30) అనే యువకుడు భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోథ్ ఎస్సై రామ్ తెలిపిన వివరాల ప్రకారం మృతునికి గత 12ఏళ్ల క్రితం మహారాష్ట్రకు చెందిన జ్యోతితో వివాహం జరిగింది వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. అయితే ఈనెల 21న మృతుడి భార్య ఇంటి నుంచి కొట్లాడి వెళ్లిపోయింది. అయితే దీంతో మనస్థాపానికి గురై 29న స్థానిక సాయినగర్ కాలనీ సమీపంలోని బీడు భూముల్లో ఉదయం ఏడు గంటలకు వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి చూడగా మృతుడు పురుగుల మందు తాగి చనిపోయినట్లు ఆధారాలు లభించాయి. మోనోసిస్ అనే పురుగుముందు తాగినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లిన ఆటో

బజార్‌హత్నూర్, జూన్ 29: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని దేగామ గ్రామ మలుపు సమీపాన గోకోండ గ్రామం నుంచి బజార్‌హత్నూర్ ఆదర్శ పాఠశాలకు వస్తున్న విద్యార్థుల ఆటో (టీఎస్01యూఏ1750) ప్రమాదవశాత్తు లోయలోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో విద్యార్థులకు స్వల్ప గాయాలు అవడంతో పెద్ద పెను ప్రమాదం తప్పిందని, ఆటోలో 15 మందికిపైగా విద్యార్థులు ఉన్నారని అక్కడే ఉన్న రైతులు తెలిపారు. కాగా స్వల్ప గాయాలైన విద్యార్థులను మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్సలను అందజేశారు. ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్లడమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని తెలుస్తుంది. ఆటో డ్రైవర్‌తో మాట్లాడగా ఆటో ముందు కుక్క అడ్డు రావడంతో దానిని తప్పించబోయి లోయలోకి ఆటో వెళ్లిందని తెలిపారు.


'ప్రైవేటీకరణను విరమించుకోవాలి'

ఆదిలాబాద్ రూరల్, జూన్ 29: సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ వాళ్లకు వేలంపాట ద్వారా అప్పజెప్పాలన్న కేంద్ర ప్రభుత్వం ఆలోచన విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ పేర్కొన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శనివారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణను మిరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బండి దత్తాత్రి, కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, కిరణ్, సచిన్, నాయకులు పాల్గొన్నారు.

'రాథోడ్ రమేష్ మృతి తీరని లోటు'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 29: బీజేపీ సీనియర్ నేత రాథోడ్ రమేష్ మృతి తీరని లోటని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాథోడ్ రమేష్ ఆత్మకుశాంతి చేకూరాలని కోరారు.టీడీపీ ప్రస్థానంలో రమేష్ రాథోడ్‌తో కలిసి పంచుకున్న స్నేహపూర్వక సంబంధాలు ఎప్పుడు మరువలేనివన్నారు.

అలాగే, రాజకీయ కురవృద్ధుడు, సీనియర్ నేత డీ.శ్రీనివాస్ మృతి పట్ల మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సంతాపాన్ని తెలిపారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు.



బల్దియా.. పాలిట్రిక్స్!

- వైస్ చైర్మన్ అవిశ్వాసంపై పట్టు బిగిస్తున్న పార్టీలు
- ఆపరేషన్ ఆకర్ష్‌కు పదును పెడుతున్న కాంగ్రెస్
- అవిశ్వాసం ఎపిసోడ్‌తో బీఆర్ఎస్ పార్టీ ఉక్కిరిబిక్కిరి
- పంతం నెగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ
- ఉత్కంఠ రేపుతున్న ఆదిలాబాద్ మున్సిపల్ రాజకీయం



● ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

ఆదిలాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానిపై అవిశ్వాస తీర్మానానికి ఆదేశించాలని జిల్లా కలెక్టర్‌కు పలువురు కౌన్సిలర్లు కలిసి ఫిర్యాదు చేయడంతో బల్దియా పాలిట్రిక్స్ మరింత ఆసక్తి రేపుతోంది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందిన వైస్ చైర్మన్ జహీర్ రంజాని అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దీంతో బీజేపీతో కలిసి బీఆర్ఎస్ వైస్ చైర్మన్‌ను గద్దె దించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇప్పటికే పార్టీలకతీతంగా పలువురు కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో బల్దియా రాజకీయం మరింతగా హీటెక్కుతోంది. ఎలాగైనా పంతం నెగ్గించుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీలు పట్టు బిగిస్తున్నాయి. ప్రతిపక్షాల దూకుడుకు చెక్‌పెట్టే విధంగా కాంగ్రెస్ పక్కాప్లాన్‌తో ముందుకెళ్తోంది. ఇంకా అవిశ్వాసం తేదీ ఖరారే కాలేదు.. అప్పుడే నువ్వా?నేనా? అనే స్థాయిలో పార్టీలు పట్టుబిగిస్తున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరగా.. తాజాగా మరో ఇద్దరు కౌన్సిలర్లు అధికార పార్టీలో చేరిపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మున్సిపాలిటీలో 49 కౌన్సిలర్లతో పాటు స్థానిక ఎమ్మెల్యే సభ్యత్వంతో కలిపి మొత్తం 50 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 2/3 మెజార్టీ.. అంటే 34 మంది సభ్యుల మద్దతు ఉంటేనే అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 22 మంది, బీజేపీకి 9మంది, ఎంఐఎం 3, కాంగ్రెస్ 15 మంది సభ్యుల బలం ఉంది. అయితే ఎంఐఎం కౌన్సిలర్లు ఎవరికి మద్దతుగా నిలుస్తారన్నదే చర్చనీయాంశంగా మారింది. అలాగే హౌజింగ్ బోర్డు కౌన్సిలర్ అశోక్ సస్పెండైన కాంగ్రెస్ నేతల వర్గం కావడంతో ఆయన ఎవరి వైపు మొగ్గుచూపుతారో అంతుచిక్కడం లేదంటున్నారు. అయితే కాంగ్రెస్‌లోకి వరుసగా వలసలు కొనసాగడంతో ప్రతిపక్షాలు ఉక్కిరిబిక్కిరవుతున్నా యి. జిల్లా కలెక్టర్ అవిశ్వాస తీర్మానానికి ముహూర్తం ఖరారు చేస్తే మున్సిపల్ రాజకీయం మరింతగా హీటెక్కే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్‌కు టచ్‌లో ఐదుగురు కౌన్సిలర్లు

వరుస వలసలతో డీలాపడిన బీఆర్ఎస్‌ను మరింత దెబ్బ తీసేందుకు కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌కు మరింత పదును పెట్టినట్లు తెలుస్తుంది. ఇప్పటికే నలుగురైదుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. మరో ఐదుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. ఇదే జరిగితే అవిశ్వాసం పూర్తిగా వీగిపోయే అవకాశం ఉంటుంది. ఇప్పటికే కొంత మంది కౌన్సిలర్లతో కాంగ్రెస్ నేతలు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. కౌన్సిలర్లు ఒకే అంటే ఇక చేరికలే ఆలస్యంగా కనిపిస్తోంది. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు ఉండడంతో వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్‌తో పాటు ఎన్నికల ఖర్చును కూడా భరించే విధంగా కాంగ్రెస్ భరోసా ఇవ్వడంతో పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా ఆదిలాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ అవిశ్వాసంపై ప్రత్యేకదృష్టిని సారించినట్లు తెలుస్తుంది.



● మున్సిపల్ పాలక వర్గం(ఇన్‌సెట్‌లో వైస్ చైర్మన్ జహీర్ రంజాని)

ఢీలా పడుతున్న బీఆర్ఎస్

అధికారం దూరం కావడంతో అసలే అంతంతమాత్రంగా మారిన బీఆర్ఎస్ పరిస్థితి.. మున్సిపల్ అవిశ్వాసంతో మరింత డీలాపడిపోతున్నట్లు కనిపిస్తుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్ అవిశ్వాసం జోలికి పోవడమే మంచిది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అవిశ్వాసంతో ఉన్న కొంతమంది కౌన్సిలర్లు దూరమవుతున్నారే తప్ప బీఆర్ఎస్ కు పెద్దగా ఒరిగేది ఏమీలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. పరిస్థితులు అనుకూలించక పోయినా.. బీజేపీ అండతో బీఆర్ఎస్ ముందుకెళ్లడం పెద్ద తప్పిదమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వైస్ చైర్మన్ పై అవిశ్వాస అస్త్రాన్ని ప్రయోగించడంతో అసలుకే మోసం వస్తుందన్న చర్చ సాగుతోంది. అవిశ్వాసం వరకు ఎవరు ఉంటారో? ఎవరు వెళ్లిపోతారో? అర్థంకాని పరిస్థితులు ఉన్నాయంటూ సొంత పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మళ్లీ రాజకీయ భవిష్యత్తు ఉండదన్న ఉద్దేశంతోనే కొంతమంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు తెలుస్తుం ది. జిల్లా కలెక్టర్‌కు అందించిన అవిశ్వాస తీర్మానం పత్రంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మద్దతునిస్తున్నట్లు సంతకం చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.

కమలం, కారు ఒక్కటేనాక?!

శత్రువుకు శత్రువు.. మనకు మిత్రుడే అన్న చందంగా ముందుకెళ్తున్న బీజేపీ ఎలాగైనా తన పంతాన్ని నెగ్గించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. బీజేపీకి తిమ్మిది మంది కౌన్సిలర్ల మద్దతు ఉండగా.. ఎమ్మెల్యే సభ్యత్వంతో మున్సిపాలిటీలో ఆ పార్టీ బలం 10కి చేరింది. బీఆర్ఎస్ సహకారంతో అవిశ్వాసాన్ని నెగ్గేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అయితే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వరకు బద్ధశత్రువులుగా ఉన్న కమలం, కారు పార్టీలు.. మున్సిపల్ అవిశ్వాసంతో ఒక్కటవుతున్నాయన్న టాక్ వినిపిస్తోంది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ముందు నుంచి ఈ రెండు పార్టీలు ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ విమర్శలకు పదును పెడుతోంది. అయితే అవిశ్వాసం తీర్మానం వరకు ఈ రెండు పార్టీల మధ్య సఖ్యత ఉంటుందా? లేదా? ఎవరి దారి వారే చూసుకుంటారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం మాత్రం కారు, కమలం పార్టీలు ఒక్కటేనన్న టాక్ జోరుగా వినిపిస్తోంది. దీంతో వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పెద్దగా నష్టం లేకపోయిన బీఆర్ఎస్‌కే మళ్లీ ఇబ్బందులు తప్పవంటున్నారు. ప్రస్తుతం ఈ రెండు పార్టీలు కాంగ్రెస్‌ను మరింత బలపడే విధంగా చేస్తున్నాయన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మొత్తానికి గత కొద్దిరోజులుగా మున్సిపల్ రాజకీయం జిల్లాలో ఉత్కంఠ రేపుతోంది.



పార్థివదేహం వద్ద రోదిస్తున్న భార్య సుమన్‌రాథోడ్, తల్లి కమలబాయి

మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ హఠాన్మరణం

- ● అనారోగ్యంతో తీవ్ర అస్వస్థత.. కన్నుమూత
- ● నేడు ఉట్నూర్ మండల కేంద్రంలో అంత్యక్రియలు

ఉట్నూర్, జూన్ 29: ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు ఉమ్మడి రాష్ట్రంలో పేరు ప్రఖ్యాతులుగాంచిన మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. టైగర్ రమేష్‌గా పేరుగాంచిన రాథోడ్ రమేష్ టీడీపీలో పోలిట్ బ్యూరో సభ్యులుగా సేవలు అందించారు. శుక్రవారం అర్ధరాత్రి రక్తపోటు తక్కువ కావడంతో హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలిస్తుండగా శనివారం ఉదయం 12గంటలకు మార్గమధ్యలో ఉన్న ఇచ్చోడ మండల కేంద్రం వద్ద రాథోడ్ రమేష్(58) తుది శ్వాస విడిచారు. రాథోడ్ రమేష్ అనారోగ్యానికి గురయ్యారని తెలసిన వెంటనే బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ జిల్లాకేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి చేరుకుని హైదరాబాద్‌కు తరలించేలా కృషి చేశారు.

● ఎమ్మెల్యే, ఎంపీగా సేవలు

నార్నూర్ మండలంలోని తడిహత్నూర్‌లో రాథోడ్ మోహన్‌నాయక్, కమలబాయిలకు జన్మించిన రాథోడ్ రమేష్. 1989లో మొదటిసారిగా వాటర్‌షె చైర్మన్‌గా రాజకీయ అరంగ్రేటం చేశారు. అక్కడి నుంచి అంచలంచెలుగా ఎదిగారు. టీడీపీలో చేరి 1995లో నార్నూర్ జడ్పీటీసీగా ఎన్నికయ్యారు. కేంద్ర మంత్రి వేణుగోపాలచారి శిష్యుడిగా ముద్రపడిన రాథోడ్ రమేష్ 1999లో తొలిసారిగా శాసనసభకు ఎన్నికయ్యారు. ఖానాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు చేరవేయడంతో పాటు అన్ని మండల కేంద్రాలలో గల్లీగల్లీకి సిమెంట్ రోడ్లు వేయించిన ఘనత ఆయనకే దక్కింది. 2004లో జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలు కావడంతో 2006లో జడ్పీ చైర్మన్‌గా ఎన్నికై ఉమ్మడి జిల్లాలోని ప్రజలకు సేవలు అందించారు. 2009లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ నుంచి లోకసభకు ఎన్నికయ్యారు. కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. అలాగే, రమేష్ రాథోడ్ పెద్దకుమారుడు ప్రస్తుత రాష్ట్ర బీజేపీ నాయకులు రాథోడ్ రితేష్ కాగా, చెల్లెలు సోనాలి.. ఆమె భర్త ఐపీఎస్ అధికారి రాంగోపాల్‌నాయక్. మరో కుమారుడు రాథోడ్ రాహుల్ యూపీఎస్సీలో ఐఆర్ఎస్ అధికారిగా ఎన్నికై లక్ష్యదీవుల్లో కలెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు.

● ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులో అంత్యక్రియలు

మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్ అంత్యక్రియలు ఉట్నూర్ మండలంలోని నాగపూర్ పంచాయతీలో ఉన్న ఎక్స్‌రోడ్ సమీపంలో వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం 11గంటలకు నిర్వహించనున్నట్లు బోథ్ ఎమ్మెల్యే జాదవ్‌అనిల్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్‌లు తెలిపారు. రాథోడ్ మృతి వార్త తెలిసిన వెంటనే ఉమ్మడి జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రజాప్రతి నిధులు ఉట్నూర్‌కు తరలించారు. ఉట్నూర్‌లోని మాజీ ఎంపీ నివాసంలో ఉన్న పార్థివదేహానికి ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే రమేష్ రాథోడ్ హఠన్మర ణం పట్ల హర్యాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. రమేష్ మృతి తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని, పార్లమెంట్ ఎన్నికల ముందే చండీగడ్‌కు వచ్చి తన ఆశీర్వాదం తీసుకున్నారని గుర్తు చే శారు. అలాగే, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ సంతాపం తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ : సీసీఎల్ఏ కమిషనర్

● వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 29: ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజార్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారా నికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా ప్రణాళికబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఇందులో ఆర్డీవో వినోద్‌కుమార్, ఎమ్మార్వో సంపత్, కలెక్టరేట్ సూపరిం టెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

● గణాంక దర్శిని ఆవిష్కరించిన కలెక్టర్

2022-23 జిల్లాగణాంక దర్శినిని కలెక్టర్ రాజార్షిషా శనివారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. జిల్లా ముఖ్యప్రణాళికాధికారి ఆధ్వర్యంలో అన్ని శాఖల నుంచి సేకరించిన సమాచారాన్ని మండలాల వారీగా రూపొందించారు. ఇందులో జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ముఖ్య ప్రణాళికాధికారి వెంకటరమణ, ఉపగణాంక అధికారి, మండల ప్రణాళిక గణాంక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ న్యాయ మహా అభియాన్ పథకాన్ని

త్వరితగతిన పూర్తి చేయాలి

● ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త ● ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లోని తహసీల్దార్లతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న పీవో ఖుష్బుగుప్త



హాజరైన అధికారులు

ఉట్నూర్, జూన్ 29: ప్రధానమంత్రి జన జాతీయ న్యాయ మహా అభియాన్ పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అన్నారు. శుక్రవారం రాత్రి ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఆధార్, కులం సర్టిఫికెట్, మొబైల్ నెంబర్లను 15 రోజులో కచ్చితంగా పూర్తి చేయాలని ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల మండల తహసీల్దార్లను పీవో ఈ సందర్భంగా ఆదేశించారు. అదేవిధంగా ఐటీడీఏ కోర్టు కేసుల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే వీడీవీకే పథకం ద్వారా శిక్షణ పొందుతున్న శిక్షణకారులందరు ఎలా శిక్షణ పొందుతున్నారని? శిక్షణ అధికారి సురేందర్‌ను అడిగి ప్రశ్నించారు. జాన్‌మాన్ ద్వారా అర్హులైన ఆదిమ గిరిజన లబ్దిదారులకు ఎన్ని బ్యాంక్ ఖాతాలు తెరిచారని, ఎన్ని వ్యవసాయ రుణాలు అసంపూర్తిగా ఉన్నాయని బ్యాంక్ ఎల్‌డీఎంను అడిగి తెలుసు కున్నారు.అదే విధంగా కిసాన్ పథకం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీడీ దిలీప్ కుమార్, డీఎంహెచ్‌వో నరేందర్, ఏడీఎంవో మనోహర్, ఆసిఫాబాద్ డీడీ రమాదేవి, తహసీల్దార్లు, జేడీఎం నాగభూషణం, తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐవో డాక్టర్ వైసీపీ శ్రీనివాస్

'వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి'

తలమడుగు, జూన్ 29: అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ప్రతీ ఒక్కరికి క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వైసీ శ్రీనివాస్ అన్నారు. శనివారం తలమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లలు, గర్భిణులకు తప్పనిసరిగా టీకాలు ఇప్పించాలని తెలిపారు. గర్భిణి అని తెలిసిన వెంటనే ఆశా కార్యకర్త దగ్గర ఆరోగ్య కార్యకర్త దగ్గర లేదా పీహెచ్‌సీలోపేర్లు నమోదు చేసుకోవాలని, కమం తప్పకుండా టీకాలు ఇప్పించుకోవడంతో పాటు ప్రతీనెల వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇందులో మండల వైద్యాధికారి డాక్టర్ హరీష్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డబ్ల్యూహెచ్‌వో బృందం

ఆదిలాబాద్ రూరల్, జూన్ 29: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(డబ్ల్యూహెచ్‌వో) బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గర్భిణుల స్క్రీనింగ్, అభా కార్డ్స్, సబ్ సెంటర్, పీహెచ్‌సీ రికార్డ్స్, మందుల నిల్వ, రోగుల కార్డ్స్, మందుల నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ అధికారి సీవీహెచ్‌వో కర్డియో వసిర్, ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ వసీ, జిల్లా డీఎంవో,ఎన్‌సీడీ అధికారి డాక్టర్ శ్రీధర్, కర్డియో వ్యాసలర్ సపోర్టర్ అజయ్ సిబ్బంది రమణ, వైద్యాధికారి సర్వరాజ్, పీహెచ్‌సీ నోడల్ అధికారులు యశోద, బొమ్మెత సుభాష్, సూపర్‌వైజర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



● అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న డబ్ల్యూహెచ్‌వో అధికారులు